
దీపావళి కథల పోటీలో బహుమతి పొందిన కథ



# వరద బాధితులు

**''శాస్త్రీ ఏమిటోయ్ విశేషాలూ" విసుగ్గా గోదావరి ఒడ్డుకేసి పోతున్న సర్వేశ్వరశాస్త్రిని పలకరించాడు వెంకన్న పంతులు.**

''వేరే ఏమున్నాయ్. అంతా మామూలే'' డిని వదుల్చుకుంటే చాలన్నట్లు సమాధానం ప్పి ముందుకి పోబోయాడు శాస్త్రి.

''కొడుకు సంపాదనలో పడాలేగానీ, కేమోయ్ అంతా బంగారమే'' అదోరకంగా వ్వుతూ ఊరివైపు కెళ్ళాడు పంతులు.

శాస్త్రికి ఒళ్ళు మండింది. ''దొంగ ధవలు పేరుకే చుట్టాలు. అవసరానికి కాస్తంత కూడా సాయం చేయరు సరికదా, ఎత్తిపొడుపులకి మాత్రం ఏం కొదవలేదు'' గొణుక్కుంటూ గోదావరి గట్టుమీదికి చేరాడు.

పాత గట్టుమీద కాస్త శుభ్రంగా ఉన్న చోటు వెతుక్కుని గావంచా పరుచుకున్నాడు.

ఇందాకటినుంచీ పెద్దకొడుకు కృష్ణమూర్తి రాసిన ఉత్తరమే పదే పదే గుర్తుకొస్తోంది. చొక్కా జేబులోంచి ఉత్తరం తీసి మళ్ళీ చదువుకున్నాడు.

''పూజ్యులయిన నాన్నగారికి నమస్కారములు. ఇక్కడ నేను క్షేమం. మీరందరూ క్షేమం అని తలుస్తాను.

నాకిక్కడ హైదరాబాద్‌లోనే ఒక మంచి గవర్నమెంటు కంపెనీలో ఉద్యోగానికి రేపు ఇంటర్వ్యూ ఉంది. ఈ ఉత్తరం మీకు

# వరదబాధితులు

...ందేసరికి ఇంటర్వ్యూ అయిపోతుంది. ఈసారైనా తప్పకుండా ఉద్యోగం వస్తుందని నాకు గట్టిగా నమ్మకం ఉంది. ఎందుకంటే ఇందులో రికమండేషను వ్యవహారాలు చాలా తక్కువని విన్నాను. ఆపైన మన అదృష్టం.

నాకు ఎంతో సిగ్గేస్తున్నా, మళ్ళీ మిమ్మల్ని మరో రెండు వందలు అడగక తప్పడంలేదు. ఎంత డబ్బైనా నాకు ఇక్కడ చాలడంలేదు. మళ్లీ మీకు ఇబ్బంది కలిగిస్తున్నందుకు మన్నించవలెను.

మ. ల. స. అమ్మకు నా నమస్కారాలు.
తమ్ముళ్ళకి, చెల్లెళ్ళకి నా దీవెనలు.

ఇట్లు,
మీ కుమారుడు,
కృష్ణమూర్తి.

బాధగా నవ్వుకుని మళ్ళీ ఆలోచనలో పడ్డాడు శాస్త్రి. పెద్దకొడుకు కాబట్టి కుటుంబానికి ఆసరా అవుతాడని ఎంతో ఆశ పడ్డాడు తను. వాడీవూళ్ళో యస్సెల్సీలో మంచి మార్కులు తెచ్చుకున్న రోజునే తనెంతగానో నచ్చజెప్పి చదువు మానిపించేద్దామని చూశాడు. "అబ్బాయీ, మనకి పౌరోహిత్యం వంశపారం పర్యంగా వస్తున్న వృత్తి. దేవుడి దయవల్ల మనకింతవరకూ అన్న పానాలకి కొదవలేదు దాన్ని నమ్ముకుంటే బతుకు గడవకపోదు. ఎగరలేని ఎత్తులకి ఎగరడానికి ప్రయత్నించద్దు" అని. కానీ పెళ్ళాం, ఊళ్ళోవాళ్ళూ కుర్రవాడు తెలివైనవాడనీ, బుద్ధిమంతుడనీ, వాడి భవిష్యత్తుని పాడుచేయద్దని తనకే నచ్చజెప్పి పీయూసీలో చేర్పించారు.

ఇంక చేసేదిలేక వాడిని రాజమండ్రి కాలేజికి పంపించి పీయూసీలో చేర్పించాడు. దానికి పెళ్ళాం మెడలో గొలుసు అయిపోయింది. పీయూసీలో మార్కులు ఇంకా బాగా రావడంతో వాడు ఇంజనీరింగులో చేంతానని పట్టుబట్టాడు. స్కాలర్‌షిప్ కూడా దొరికేందుకు అవకాశం వచ్చింది. ఇక వాడిని నిరుత్సాహ పరచకూడదని ఉన్న ఆయిదెకరాల్లోనూ రెండెకరాలు పూర్తిగా అమ్మేసి ఇంజనీరింగు పూర్తి చేయించాడు.

చదువైతే పూర్తయిందిగాని బండి అక్కడే ఆగిపోయింది. వాడి ఖర్మేమోగానీ ఆ రోజుల్నుంచే ఇంజనీర్లకు సరైన ఉద్యోగాలు దొరకకపోవడం మొదలయింది. డిగ్రీ తీసుకుని నాలుగేళ్ళయినా, ఇంతవరకూ దేశాటనమూ, తిప్పటా మిగిలాయి తప్ప సరైన ఉద్యోగం మాత్రం దొరకలేదు. అక్కడికీ వాడు అభిమానపడుతూనే ఎవరికీ తెలియకుండా ఏదో కార్ఖానాలో చిన్నపని చేస్తూ గడుపు కొస్తున్నాడు. అది సరిగా వాడి తిండికే సరిపోవడంలేదు. మరి ఇంటర్వ్యూలకి, రైళ్ళ ఛార్జీలకీ భరించడానికే తనకి తడిసిమోపెడయిపోయి మరో ఎకరం అమ్మేయాల్సి వచ్చింది.

వాడితో ఇదే ఊళ్ళో చదువుకుని, మార్కులు రాకపోవడం వలన ఉన్న ఊళ్ళోనే ఏవో వృత్తులు చేసుకుంటున్న వాళ్ళపనే చాలా బాగుంది.

రజకుడు వీరన్న కొడుకు శుభ్రంగా లాండ్రీ పెట్టాడు.

బార్బర్ రాముడి కొడుకు మోడరన్ సెలూన్ పెట్టాడు.

మరోడు టైలరింగ్ నేర్చుకుని ప్యాంటుకి పాతిక రూపాయలు చొప్పున సంపాదించ గలుగుతున్నాడు.

పౌరోహిత్యమే చేసుకుంటే ఇంతకంటే బాగా వాడికి గడవకపోయేదా! నాగరికతకీ, పెద్దపెద్ద కోరికలకీ వీడిలాగ బలైపోతున్న వాళ్ళెందరో!

అలాగని వాడికేమైనా దురలవాట్లున్నాయా అంటే అదీ లేదు. వాడికీ తనకంటే ఆత్రంగా ఉంది, ఎంత పెందరాళే జీవితంలో స్థిరపడదామా అని.

పోనీ తన ఆర్థిక పరిస్థితైనా బాగుందా అంటే అదీ లేదు. రెండు మూడేళ్ళ క్రితం వరకూ తనకి పౌరోహిత్యంమీద బాగా డబ్బు, స్వయంపాకాలూ అవీ బాగానే గిట్టుతూండేవి. కర్మం కాలి ఆ మధ్యనోసారి జబ్బు చేయడంతో గొంతు కొన్నాళ్ళు పడిపోయింది. ఆ తరవాత మాట వచ్చినా, మాటలు తడబడడంతోను, గొంతు శ్రావ్యత తగ్గిపోవడంతోనూ, మంత్రాలు చదవడానికి ఎక్కువగాతనని ఎవరూ పిలవడంలేదు. ఈలోగా మరో ఇద్దరు బ్రాహ్మలు పోటీ కొచ్చేసి నోటి దగ్గర కూడు దాదాపుగా తీసేసుకున్నారు.

"సూడా గోదారమ్మతల్లి ఎల్లా పొంగుకొత్తావుందో" ఎవరో గట్టిగా అనుకుంటూంటే మళ్ళీ ఈ లోకంలోకి వచ్చిపడ్డాడు శాస్త్రి.

వాళ్ళు చెప్పింది నిజమే. నెల రోజుల క్రిందటి గోదావరికి ఈ రోజున్న గోదారికీ ఎంతో తేడా వుంది!


అప్పుడు నీళ్ళు నిశ్చలంగా నిలాల్లాగా ఉండేవి. ఒకనాటి పల్లెటూళ్ళ స్వచ్ఛతను గుర్తు చేస్తూండేదా నీరు. మధ్య మధ్య లంకలుండేవి. వాటిల్లో ఏవేవో పండేవికూడా. పశువులని అందులోకి తోలితే వాటికి గ్రాసం కూడా బాగా దొరికేది.

కొత్తనీరొచ్చి పాతనీటిని కొట్టేయడం అంటే నిజంగా ఎలాగుంటుందో తేరిపార చూస్తున్నాడాయన.

ఈ వరద గోదావరి నీళ్ళు చూడ్డానికే అసహ్యంగా ఉన్నాయి. మధ్య మధ్యన నురగలు కుళ్ళిపోతున్న నవనాగరికతా కాంత ఒంటిమీద మచ్చలా అన్నట్లున్నాయి.

ఆ ప్రవాహంలో ముళ్ళుతీగలు, చచ్చిపోయిన పక్షులు, సగం కాలిన దుంగలు, ఏవేవో కొట్టుకొస్తున్నాయి.

ఇంతకు ముందుండిన లంకలన్నీ మునిగి







## మినీ మహా వృక్షాలు

ఇంటి "ముందుగదుల్లో"కి మఱ్ఱిచెట్లను, జువ్వి చెట్లను తెచ్చి పెంచే పద్ధతిని "బాన్సాయ్" అంటారు. దీనిలో సిద్ధహస్తురాలైన శ్రీమతి సత్యవతీనరసింహం ఇటీవల విజయవాడ ఆఫీసర్స్ క్లబ్‌లో, ఒంటిచేతిమీద సొంత పిల్లల్లాగ సాకిన ఈ మహా (మినీ) వృక్ష సంపదని ప్రదర్శించారు. ఈ చెట్లలో ఏదీ అడుగున్నర ఎత్తు దాటదు.

పోయాయి. అవి ఉండినచోట మునుపు ఎత్తుగా ఎదిగిన రెల్లు కొసలు మాత్రం కనిపిస్తున్నాయి. దూరాన్నుంచి పాపి కొండలు నున్నగా కనిపిస్తున్నాయి. అవికూడా కొంత మునిగినట్లే ఉన్నాయి ఈ వరదలో.

ఈ వరద తగ్గిపోయాక, మునుపు ఇక్కడున్న లంకలు మాయమై మరో చోట చేరతాయి. బడి పంతుళ్ళ జీతాలు వెళ్ళి కాబూలీవాడి చేతిలో చేరినట్లు.

గోదావరి చాలా పోటుమీద ఉండడంతో వరద నిరోధక చర్యలన్నీ తీసుకుంటున్నారు. ఇసక బస్తాలూ, మిగతా సరంజామా అంతా లారీలమీద అప్పటికే చేరేశారు. డిపార్టుమెంటు వాళ్ళనుకుంటున్నారు — ఈ చుట్టు ప్రక్కల ఉన్న ఊళ్ళలో ఏదో ఒకదానికి గండి పడక తప్పదని. మరోసారి శాస్త్రికి గుండె గుభేలు మంది. తనకు మిగిలిన రెండెకరాల పొలమూ సరిగ్గా పోతగట్టు వెనకనే ఉంది. గోదారి దాన్ని కాస్తా ముంచేస్తే తన భుక్తి ఏం గాను ? ఓసారి పొలం మునిగిందంటే మరో రెండేళ్ళవరకు ఏదీ పండదు. అల్లా జరిగితే

# వరదబాధితులు

సీతారామాభ్యానమః అని ఇళ్లిల్లూ తిరగక తప్పదు.

ఏవేవో ఆలోచిస్తూనే గోదావరికేసి చూస్తూనే ఉన్నాడు. గోదార్లో ముగ్గురు కుర్రవాళ్ళు కలపని ఒడ్డుకు చేర్చేందుకు ఈదుతున్నారు. ఎన్నో సుడులున్నా చాకచక్యంగా తప్పించుకుంటూ జాగ్రత్తగా ఈదుతున్నారు. వాళ్ళలో ఇద్దరికి మంచి దుంగలే దొరకడంతో నెమ్మదిగా ఒడ్డుకి చేరుకోగలిగారు. మిగిలిన మూడో కుర్రాణ్ణే చూస్తున్నాడు శాస్త్రి. వాడికి పట్టుమని పదేళ్ళుంటాయో లేదో. వాడికి ఇంతవరకూ ఏదీ దొరికినట్లులేదు. మళ్లీ మళ్ళీ ముందుకీ, వెనక్కీ ఈదుకుంటున్నాడు.

ఎలాగైతేనేం, వాడికీ, ఓ దుంగ దొరికింది. దాన్ని ఆధారంగా ఈదుకుంటూ వస్తున్నాడు వాడు. అయితే వడి తూర్పు వైపుకి ఎక్కువగా ఉండడంతో పడమటి వైపుకున్న ఒడ్డుకి చేరడం కోసం వాడు నానా తంటాలు పడుతున్నాడు.

హఠాత్తుగా వాడొక సుడిలో ఇరుక్కున్నాడు. దానికితోడు చేతిలో దుంగ పట్టు జారిపోయింది వాడికి. గిరగిర తిరుగుతూ ఆ సుడితోపాటు కొట్టుకుపోతున్నాడు.

శాస్త్రి కంగారుగా లేచాడు. ఏం చేయాలో తెలియక "ఒరేయ్ కుర్రాడు మునిగిపోతున్నాడు, సాయం చేయండ్రా" అని కేకలు పెట్టాడు.

ఓ ఫర్లాంగు దూరం లోపలి కున్నాడు వాడు. తనకా ఈత రాదు. దేవుడిమీద భారంవేసి కూర్చున్నాడు.

మరుక్షణం ఆశ్చర్యంగా ఆ కుర్రాడు చాకచక్యంగా సుడిలోనించి తప్పించుకోవడమే కాకుండా ఆ దుంగను కూడా గట్టుకుచేర్చాడు.

ఈలోగా చుట్టుపక్కల పోగడిన జనం కూడా అమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్నారు.

"అదేటి సాత్తుర్లుగారూ, అంత బయపడిపోనారు ! ఆడు రోజూ చేసే పనే కదా ఇది. అంత కంగారు దేనికి ?" అన్నాడు అక్కడున్న వడ్డిగూడెం మనిషొకడు.

"బాబుగారూ, మీ మనసలాంటిది. మీలాటోళ్ళు ఊళ్ళో ఉండబట్టే ఈ వూరింత మాత్రమైనా ఉంది. సీకటడిపోతాంది. తమరిక ఇంటి కెళ్ళండి బాబూ" అని మరోడు చెప్పడంతో శాస్త్రి ఇంటి మొహం పట్టాడు.

నీరసంగా కాళ్ళీడ్చుకుంటూ ఇల్లు చేరుకున్నాడు శాస్త్రి.

చిన్నపిల్లలిద్దరూ జుట్టూ జుట్టూ పట్టుకుని తన్నుకుంటున్నారు. వాళ్ళిద్దర్నీ విడదీసి, చెరో రెండు దెబ్బలేసి, విసుగ్గా నులకమంచంమీద కూలబడ్డాడు.

ఈలోగా శాంతమ్మ కాఫీ పట్టుకొచ్చింది.

అది తాగి నడుం వాల్చాడు.

ఆ రోజు శనివారం కాబట్టి ఆ రాత్రికి వాళ్ళింట్లో భోజనం ప్రసక్తిలేదు. అంటే ఓ రోజు కలిసొచ్చిందన్నమాట.

* * *

ఆదివారంనాడు పొద్దున్న మళ్ళీ గోదారి ఒడ్డున నిలబడ్డాడు శాస్త్రి.

అదేం విచిత్రమోగాని ఈరోజు పాపి కొండలు కూడా అసలు కనిపించడంలేదు తనకి. చుట్టూ అంతా జలమయం.

తనకి మిగిలిన రెండెకరాల పొలం, దాని పక్కనున్న రహదారి, బంగళా ఏదీ కనిపించడం లేదు. పక్కనున్న మఱ్ఱిచెట్టు కొన ఆకులు మాత్రం కనిపిస్తున్నాయి.

తను నిలబడిన గట్టు కూడా తడితడిగానే ఉంది.

మనుషులంతా ఏమైపోయారో? ఒక్కడూ కనిపించడంలేదు.

వరదనీట్లో ఈసారి పెద్ద పెద్ద చెట్లే కొట్టుకొచ్చేస్తున్నాయి.

దూరంగా మనిషెవడో కొట్టుకు పోతున్నాడు. మనిషో, శవమో కూడా తెలియడంలేదు.

చెట్లన్నీ ఓ వైపుకి కొట్టుకెడుతుంటే ఆ మనిషి అవతలి వైపుకి కొట్టుకు పోతున్నాడు.

అరె ఎవరో తెలిసినవాడిలాగున్నాడే!

కళ్ళు నులుముకుని మళ్ళీ చూశాడు.

ఎవరో ఏమిటి! కిష్టుడే!

"బాబూ కృష్ణా!" గట్టిగా అరుద్దామన్నా ఎందుకో నోరు పెగిలడం లేదు.

కొడుకు నిస్సహాయంగా తనకేసి చూస్తూ నాన్నా! అని అరుస్తూ అలాగ కొట్టుకు పోతూనే ఉన్నాడు.

నీళ్ళు మింగేసేడేమో చేతులు కూడా ఎత్తేస్తున్నాడు.

తనకేం చేయాలో తోచలేదు. కేకలేస్తూ చేతికేది దొరికితే దాన్ని విసిరేస్తున్నాడు.

ఏం ఉన్నాయి అక్కడ రాళ్ళూ, మట్టి గడ్డలు తప్పించి?

ఏం చేయలేక అవాక్కయి చూస్తూనే ఉన్నాడు.

భోరున ఏడుస్తూనే ఉన్నాడు.

సాయానికి ఎవడూ రావడంలేదు.

కిష్టుడి జుట్టొక్కటే కనిపిస్తోందిప్పుడు.

అదేదో నల్లటి కర్రలాగుందే. దాన్నైనా వాడు పట్టుకోగలిగితే బాగుండును. అంతా వెంకటేశ్వరస్వామి దయ.

అమ్మయ్య. నిజంగా పట్టుకున్నాడు దాన్ని. గట్టుకొచ్చేస్తాడిక.

ఇంతలో 'అమ్మా' అని మూలిగి హఠాత్తుగా పట్టునదిలేసాడు కిష్టుడు.

మళ్ళీ భోరున ఏడిచేశాడు శాస్త్రి.

"నాయనా! నువ్వు పట్టుకున్నది పామురా. అదెందుకు పనికొస్తుంది. ఓ కాటు వేసి మరీ పారిపోతుంది. నేనే లోపలికొస్తాను పద. నేను చస్తే చచ్చాను. నన్నైనా పట్టుకుని ఒడ్డుకు చేరుకో" అంటూ దూకేశాడు నీళ్ళలోకి.

* * *

మెలకువొచ్చేసరికి కాలు బెణికి మంచానికి ఓ మూల ఉన్నాడు.

"ఏమండీ అన్ని కేకలు పెట్టారు! పీడకలగానీ వచ్చిందా ఏమిటి?" అంటూ శాంతమ్మ మంచం దగ్గరికొచ్చింది.

"అవునే చాలా వెధవ కలొచ్చింది. అందులో తెల్లవారుజామునకల. మన పొలం మునిగి పోయినట్లు, కిష్టుడు గోదార్లో కొట్టుకుపోతున్నట్లుగామా, మీరెవరూ కనిపించనట్లూ" అని వర్ణించుకొచ్చాడు ఆ కలని.

"అన్నట్లు ఓ చీపురుపుల్ల ఇలా పారేయ్ దుస్వప్న నివారణకి." అని మంత్రం చదువుకుని ఓ చీపురుపుల్లని విరిచి పారేశాడు.

బయటికొచ్చి పళ్ళు తోముకుంటూంటే ఊళ్ళోవాళ్ళ ద్వారా తెలిసింది. గండి ఇటు వైపు కాకుండా రాత్రి అద్దరిని (అవతలి ఒడ్డుని) కొట్టేసిందని.

ఆ రోజు పేపర్లో కూడా చదివాడు రాజమండ్రికి దగ్గరగా గండి పడిందనీ, వరద బాధితుల సహాయార్థం ప్రభుత్వం కార్యక్రమాలను చేపట్టిందనీను.

## దీపావళి కథ!

"మన రోజులింకా బాగున్నాయే. మన పొలానికి ఏం కాలేదు అదృష్టవశాత్తూ" అంటూ సంతృప్తిపడ్డాడు.

* * *

మరో రెండు రోజుల తరవాత కొడుకు దగ్గర్నుంచి ఇంకో ఉత్తరం వచ్చింది వాళ్ళకి. వణుకుతున్న చేతుల్తో శాస్త్రి ఆ ఉత్తరాన్ని ఆత్రంగా చదువుకున్నాడు. ఆ ఉత్తరం కూడా యథాప్రకారం మామూలుగానే ఉంది. అందులోకూడా సెలవు కాలేదనీ, ఏదో మోసం జరిగిందనీ సారాంశం.

ఏం చేయాలో తెలియక తల పట్టుకున్నాడు.

"నే చెప్పలేదుటండీ కిష్టుడికి ఏలినాటి శని రోజులు. ఇంకా రెండు మూడేళ్ళు బాధ పడక తప్పదు. మరేం చేస్తాం, వచ్చినట్లు భరించాల్సిందే" నిట్టూరుస్తూ అంది శాంతమ్మ కూడా ఉత్తరం చదువుకుని.

ఎవరో తలుపు తట్టారు.

శాంతమ్మ లేచి తలుపు తీసింది.

ఎదురుగుండా కొడుకు!

'అమ్మా బాగున్నారా!' అంటూ లోపలి కొచ్చేశాడు.

"అదేంరా! ఉత్తరం రాయకుండానే వచ్చేశావు" అంటున్న తండ్రితో, "అర్జెంటుగా ఎక్స్‌ప్రెస్ బస్సులో రావాల్సి వచ్చింది నాన్నా. ముఖ్యమైన వ్యవహారం ఒకటుంది. టైం లేదు." అంటూ పడక్కుర్చీలో వాలాడు.

"ఏంట్రా మళ్ళీ డబ్బేమైనా కావాలా" లోలోపల భయపడుతూనే అడిగాడు తండ్రి.

"అవున్నాన్నా. ఆ మధ్య ఒక బ్యాంకు టెస్టుకి వెళ్ళాను కదా! టెస్టులో పాసయ్యా. ఎల్లుండి ఇంటర్వ్యూ. కనీసం రేపు రాత్రి బస్సులో తిరిగివెళ్ళాలి. నాలుగువేలు పట్టుకెడితే పని తప్పకుండ అయేటట్లుంది. నేను చదువుకున్నదానికీ, ఈ ఉద్యోగానికీ సంబంధం లేకపోయినా, ఇదైనా దొరికితేచాలు. విశేషం లాంటి ఉద్యోగం. మా వాళ్ళల్లో చాలామంది ఇలాగే ఉద్యోగాల్లో దూరిపోతున్నారు. ఇన్ని బాధలు పడడం కంటే ఇదే నయమనిపిస్తోంది" విసుగ్గా అన్నాడు కృష్ణమూర్తి.

"అది సరేరా నాయనా. ఎల్లాగోలాగ నాలుగువేలు పుట్టించామే అనుకో. పనవుతుందని నమ్మకం మాత్రమేమిటి? జేబులో పడేసుకుని అవతలకి పొమ్మంటే ఏం చేయగలం?" సందేహంగా అడిగింది తల్లి.

"ఆపాటి నమ్మకం లేకపోతే ఎలాగమ్మా. నమ్మకం లేకపోతే ఏం పని మాత్రం జరుగుతుంది. ఇది తప్పకుండ అవుతుందనిపించబట్టేగా పరుగుపెట్టుకొచ్చాను. మీ కిష్టం అయితే ఇవ్వండి. లేకపోతే నా దారిన నేను పోతాను. నేను చదువులో చేరిన్నాటి నుండి ఒకే గోలయిపోయింది. ఇప్పుడు చూసి చూసి పౌరోహిత్యం కూడా చేయలేను. ఎందుకూ పనికిరాకుండా అయిపోయాను" బాధగా అన్నాడు కొడుకు.

"సరేలేవే. మన అదృష్టం ఇలా తగలడింది. మనం చేయగలిగిందింకేం ఉంది? ఆ చేయగలిగినది కాస్తా పూర్తిచేసి రేపు రాత్రి బస్సుకి పంపిస్తానులే. లేచి స్నానం చెయ్యరా" అంటూ లేచాడు శాస్త్రి.

* * *

ఎలాగైతేనేం మిగతా పొలాన్ని కూడా తాకట్టుపెట్టి డబ్బు తీసుకురాగలిగాడు తండ్రి. కొడుకు చేతికి డబ్బిచ్చి బస్సెక్కించాడు. ఇంటి కొస్తూంటే అనిపించిందతనికి మనుషులు కొట్టుకుపోయేందుకు, పొలాలు మునిగిపోవడానికి ఒక్క గోదావరి వరదే కారణం కానక్కర్లేదనీ, మనుషుల్ని నిండా ముంచే ప్రవాహాల చాలా రకాలున్నాయని. ★